

కలెక్టర్, ఎస్‌పిలను కలిసిన నూతన కమిషనర్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం


కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న కమిషనర్

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ నూతన కమిషనర్ రాహుల్ మీనా బుధవారం కలెక్టర్ కీర్తి చేకూరిని కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. నూతన కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆయనకు కలెక్టర్ కీర్తి చేకూరి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నగరపాలక సంస్థ పరిధిలోని పలు అభివృద్ధి అంశాలు, ప్రజా సౌకర్యాల మెరుగుదల, శానిటేషన్, మౌలిక సదుపాయాల బలోపేతం వంటి అంశాలపై ఇరువురు చర్చించారు. అనంతరం ఆయన ఎస్‌పి డి.నరసింహకిశోర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. నూతన కమిషనర్‌కు ఎస్‌పి శుభాకాంక్షలు తెలిపారు.

దోమల దండయాత్ర

- కోట్లు వెచ్చిస్తున్నా ఫలితం శూన్యం
- ఆందోళనలో పట్టణ వాసులు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

రాత్రే కాదు.. పగటిపూటా దోమలు విజృంభిస్తున్నాయి. ఇంటో ఉన్నా..రోడ్డు మీద నిల్చున్నా..ఆహ్లాదం కోసం పార్కుకు వెళ్లినా.. దోమలు చుట్టుముట్టుతున్నాయి. దోమల భారిన పడిన ప్రజలు ఆసుపత్రుల పాలు అవుతున్నారు. ప్రాణాంతక మలేరియా, డెంగీ, చికున్ గున్యా వంటి వ్యాధులను వ్యాపింపజేసే దోమలకు నిలయంగా జిల్లా నిలుస్తోంది. ఇప్పటికే దోమకాటుతో జిల్లావ్యాప్తంగా జ్వర పీడితుల సంఖ్య పెరుగుతోంది. పట్టణాలల్లోనూ కేసులు ఘననీయంగా పెరుగుతున్నాయి. ఈ ఏడాది తొలిసారిగా నీరు నిల్వ ఉన్న చోట్ల డ్రోన్లతో దోమల మందును పిచికారీ చేయాలని నిర్ణయించారు. కేవలం తొలి దశలో చేపట్టి ఆ తర్వాత నిర్లక్ష్యం చేశారు. మరోవైపు దోమలు నివారించడంలో, వాటి వల్ల వచ్చే వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించడంలో యంత్రాంగం విఫలమవుతోంది.

లక్షలాది రూపాయలు వృధా

రాజమహేంద్రవరం నగరంలో ఏటా సుమారు రూ.10 లక్షలు వెచ్చిస్తున్నా ఆ దిశగా ఫలితాలు లేవు. రోజుకు 160 మెట్రిక్


రాజమహేంద్రవరం లాలాచెరువు వద్ద పేరుకుపోయిన మురుగునీరు

టన్నుల వ్యర్థాలు ఉత్పత్తి అవుతున్నా వాటిని సకాలంలో తరలించే పరిస్థితి లేదు. సచివాలయాల పరిధిలో వారానికి రెండు సార్లు ఫాగింగ్ చేయాల్సి ఉన్నా జరగడం లేదు. నగర పాలక సంస్థలో 25 ఫాగింగ్ యంత్రాలుంటే 10 మరమ్మతులకు గురవ్వగా ఉన్నవి సమర్థవంతంగా వినియోగించే పరిస్థితి లేదు. అదే విధంగా కొవ్వూరులో ఏటా దోమల నివారణకు రూ.5 లక్షలు వెచ్చిస్తున్నా ఫలితం శూన్యం. కొవ్వూరు సిటీలో 23 మురికివాడలు, 1800 ఖాళీ స్థలాలు ఉన్నాయి. ఒకే ఫాగింగ్ యంత్రం ఉండటంతో దాన్నే మొక్కుబడిగా రోజుకో ప్రాంతానికి తిప్పుతున్నారు. ప్రతి రోజూ 25 మెట్రిక్ టన్నుల చెత్త ఉత్పత్తి అవుతుందని అధికారుల గణాంకాలు చెబుతున్నాయి. కొవ్వూరు మున్సిపాలిటీలో అందుబాటులో ఉన్న రెండు కంపాక్టర్లు మూలకు చేరటంతో ట్రాక్టర్లతో తరలింపు చేపడుతున్నారు. నిడదవోలు సిటి పరిధిలోని వార్డుల్లో ఈ సీజన్‌లో ఫాగింగ్ చేసిన దాఖలాలు లేవు. మూడు ఫాగింగ్ యంత్రాలుంటే రెండు మూలకు చేరగా ఒకటే అందుబాటులో ఉంది. పట్టణంలో పారిశుధ్య పనులకు ఏటా సుమారు రూ.50 లక్షలు, దోమల నివారణకు రూ.3 లక్షలు వెచ్చిస్తున్నట్లు అధికారుల గణాంకాలు చెబుతున్నాయి. పంచాయతీలలో పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్థంగా మారుతోంది. మరోవైపు పారిశుధ్య నిర్వహణపై ప్రజల్లో అవగాహన కల్పిస్తాం అంటూ తాజాగా స్వచ్ఛ ఆంధ్రాకు శ్రీకారం చుట్టిన విషయం విధితమే. ప్రజల అవగాహన సంగతి ఎలా ఉన్నా దోమల నియంత్రణకు, పారిశుధ్య నిర్వహణపైనా స్పష్టమైన కార్యచరణ పాలనా యంత్రాంగంలో లేదని పై గణాంకాలు చెబుతున్నాయి.

ప్రజలపై ఆర్థిక భారం

దోమల నియంత్రణకు ప్రజలపై ఆర్థిక భారం తప్పడం లేదు. దోమల నుంచి ఉపశమనం పొందేందుకు ప్రతి కుటుంబం రోజుకు రూ.2 ఖర్చు చేస్తోంది. జిల్లా వ్యాప్తంగా 7 లక్షల కుటుంబాలు ఉండగా దోమల నివారణకు ప్రతి నెలా రూ.4.20 కోట్లు ఖర్చు చేస్తున్నాయి. రోజుకు రూ.2 వంతున మస్కిటో కాయిల్స్‌కు రూ.10 లక్షలు, లిక్విడ్ రూపేణా మరో రూ.4 లక్షలు ఖర్చు చేస్తున్నారు. ఏడాదికి సుమారు ఖర్చు రూ. 50.2 కోట్లు పైమాటే. ఈ ఖర్చుకు కార్పొరేషన్, మున్సిపాలిటీలకు, పంచాయతీలకు పన్నులు రూపంలో పరోక్షంగానూ చెల్లిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టి సారించి దోమల నివారణకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలి.

మే నుంచి అక్టోబరు వరకూ నమోదైన జ్వరాల కేసులు

పట్టణం	నమోదైన కేసులు
రాజమహేంద్రవరం	1360
నిడదవోలు	530
కొవ్వూరు	724

దోమల ఉత్పత్తి కేంద్రాలుగా డ్రెయిన్లు

రోడ్డుకు ఇరువైపులా ఏర్పాటు చేసిన డ్రెయిన్‌లు దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారుతున్నాయి. కాల్వలు ఆధునికీకరించకపోవటం, పూడికను తీయకపోవడంతో మురుగు నీరు పారడం లేదు. రోజుల తరబడి నీరు నిల్వ ఉండటంతో తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. తద్వారా దోమల ఉత్పత్తికి కేంద్రాలుగా మారుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి దోమల నివారణకు అవసరమైన చర్యలు చేపట్టాలి.

-జి.రాము, తుమ్మలావ, రాజమహేంద్రవరం


ఫుడ్ స్టాల్స్‌లో తినుబండారాలను రుచి చూస్తున్న విసి ప్రసన్నశ్రీ

నన్నయలో ఆహార్ మహోత్సవ్ ప్రారంభం

ప్రజాశక్తి - రాజానగరం

ఆదికవి నన్నయ యూనివర్సిటీలో ప్రపంచ ఆహార దినోత్సవం సందర్భంగా ఆహార్ మహోత్సవ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని యూనివర్శిటీ విసి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎన్‌సిసి విద్యార్థుల గౌరవ వందనాన్ని స్వీకరించి కన్వెన్షన్ సెంటర్‌పై నుంచి మెగా బ్యానర్‌ను విసి ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సభలో విసి మాట్లాడారు. సంస్కృతి, సంప్రదాయాలకు నిలయమై చక్కని అనుబంధాలు, అభిరుచులకు వేదికైన గోదావరి జిల్లాల ప్రాశస్త్యాన్ని తెలియజెప్పేలా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మూడు రోజుల పాటు ఆహార్ మహోత్సవ్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 14వ తేదీన క్విజ్, డిబేట్, పవర్ పాయింట్ ప్రెజెంటేషన్, పోస్టర్ ప్రెజెంటేషన్ వంటి అకడమిక్ కార్యక్రమాలు నిర్వహించామని చెప్పారు. అక్టోబర్ 16 ప్రపంచ ఆహార దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆహార్ మహోత్సవ్ కార్యక్రమాన్ని పెద్దఎత్తున నిర్వహించనున్నట్లు తెలిపారు. 15వ తేదీన జిల్లా ఆహార పదార్థాలకు సంబంధించిన స్టాల్స్ ఏర్పాటు చేశారని సాంప్రదాయ వంటకాలతో, విభిన్న రుచులతో సాల్స్ కనువిందు చేసాయని చెప్పారు. ఆధునిక జీవితంలో ప్రపంచీకరణ ప్రభావంతో ఆత్మీయతలు, అనుబంధాలు మాయమై సంస్కృతి, సంప్రదాయాలు కనుమరుగవుతున్నాయని అన్నారు. తరాల మధ్య సంబంధాన్ని చాటి చెప్పేందుకు చక్కని కార్యక్రమాన్ని రూపొందించా మన్నారు. పిజ్జాలకు, బర్గర్లకు అలవాటుపడిన నోటికి అచ్చమైన ఆవకాయ వంటి సంప్రదాయ రుచులు తెలియడం లేదన్నారు. పరాయీకరణకు లోనైపోతున్న జాతికి తమ వారసత్వ సంపదను, తమ సంప్రదాయాలను, ఆహారపు అలవాట్లను, వంటకాలను ఆరోగ్యకరమైన జీవితాన్ని, గోదావరి జిల్లా వంటల గొప్పతనాన్ని తెలియజేయాలనే ప్రయత్నం మెగా ఫుడ్ ఫెస్టివల్ లక్ష్యం అన్నారు. 1960కి ముందు అమ్మమ్మ, నాన్నమ్మలు వండిన వంటలు, 1980కి ముందు వచ్చిన, తర్వాత వచ్చిన కొత్త కొత్త వంటలు, 2001 నుంచి ఈమధ్య కాలంలో వచ్చిన కొత్త కొత్త ఆహారపు అలవాట్లు, వంటలు వీటన్నింటిని సమీక్షించేందుకు నన్నయ వర్సిటీ మెగా ఫుడ్ ఫెస్టివల్ వేదిక అవుతుం దన్నారు. నాన్నమ్మ తాతయ్యల ఒడిలోని వెచ్చదనం ఎలా కోల్పోయామో ఆరోగ్యకరమైన వంటల గొప్పతనాన్ని మనం కోల్పోతున్న దశలో ఉన్నామని అన్నారు. అవన్నీ ఇవాళ జనరేషన్‌కి తెలియాల్సిన అవసరం తప్పనిసరిగా ఉందన్నారు. తూర్పు గోదావరి జిల్లా వాసులు వివిధ రకాల ఆహార పదార్థాలతో స్టాల్స్ ఏర్పాటు చేశారని, గురువారం పశ్చిమ గోదావరి జిల్లాల వాసులు ఆహార్ మహోత్సవ్ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమానికి న్యాయనిర్ణేతలుగా జిల్లా రోగనిరోధకత అధికారి కోమలి, కెమిస్ట్రీ లెక్చరర్ బిబి.నలినీ, గైనకాలజిస్ట్ డాక్టర్ చందన పర్వతవర్ధిని, సత్యదేవ నర్సరీ యజమాని శ్రీలక్ష్మీ, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రతినిధి ఎస్.పుష్పలత వివిధ కేటగిరిలలో ఆహార పదార్థాలను పరిశీలించారు. విజేతలకు గురువారం ముగింపు కార్యక్రమంలో బహుమతులు అందిస్తారని తెలిపారు. ఆహార్ మహోత్సవ్‌లో భాగస్వామ్యం అయిన అందరికీ యూనివర్సిటీ తరపున సర్టిఫికెట్లు అందిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య కెవి.స్వామి, ప్రిన్సిపల్ డాక్టర్ పి. విజయ నిర్మల, ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగాధిపతి ఆచార్య డి.కల్యాణి, ఆర్ట్స్ కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్‌కె.రామచంద్ర, హైకోర్టు అడ్వకేట్ ఎ.రాజేశ్వర రావు, పుల్లా చిన్న సత్యనారాయణ పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన కమిషనర్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం


కమిషనర్ రాహుల్‌మీనా

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కమిషనర్‌గా రాహుల్ మీనా బుధవారం ఉదయం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా రాహుల్ మీనా మాట్లాడుతూ నగరపాలక సంస్థ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. నగరవాసులకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని, సమస్యలుంటే తనను సంప్రదించాలని కోరారు. అనంతరం అదనపు కమిషనర్ పివి.రామలింగేశ్వర్, డిసి ఎన్.వెంకటరమణ, సెక్రటరీ జి.శైలజవల్లి, ఇన్‌ఛార్జ్ ఎస్ఇ రీటా, ఎంహెచ్ఒ వి.వినూత్న, డిప్యూటీ సిటీ ప్లానర్ నాయుడు, రెవెన్యూ అధికారులు సిహెచ్.శ్రీనివాసరావు, రవికుమార్, మేనేజర్ ఎండి అబ్దుల్ మలిక్, ఇఇ మదర్షా అలీ, కమిషనర్‌కు అభినందనలు తెలిపారు.

విజేతకు అభినందన

ప్రజాశక్తి - నిడదవోలు


విజేతను అభినందిస్తున్న కృపానందవర ప్రసాద్

రాష్ట్ర 7వ పారా స్విమ్మింగ్ ఛాంపియన్ షిప్ -2025 పోటీలలో గోల్డ్, బ్రౌన్ మెడల్ సాధించిన జిల్లాలోని కొంతమూరుకు చెందిన వికలాంగుడు మండపాక సతీష్‌ను నిడదవోలు జ్యోతిర్మయి వికలాంగుల సంక్షేమ సంఘం కార్యదర్శి వంగా కృపానందవరప్రసాద్ అభినందించారు. ప్రతిభకు వైకల్యం ఏమాత్రం అడ్డు కాదని, సంకల్పం, కృషి, పట్టుదల, నిరంతర సాధనతో దేనినైనా సాధించవచ్చననీ సతీష్ నిరూపించాడన్నారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

అభివృద్ధిని ఓర్వలేకే వైసిపి విమర్శలు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

కూటమి హయాంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి వైసిపి ఓర్వలేకపోతోందని మాజీ మంత్రి, ఆచంట ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ అన్నారు. ప్రెస్‌క్లబ్‌లో బుధవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ స్కీముల్లో భాగంగా మాత్రమే రాష్ట్రానికి 17 వైద్య కళాశాలలు వచ్చాయన్నారు. జగన్ నిర్వాకం వల్ల వాటి నిర్మాణం అతీగతీ లేకుండా పోయిందని విమర్శించారు. వైద్య కళాశాలలకు 2020లో రూ.8,480 కోట్లు కేటాయించారన్నారు. నాలుగేళ్లలో వైసిపి ఖర్చు చేసింది రూ.1,550 కోట్లు మాత్రమే అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఖజానా నుంచి ఒక్క రూపాయి కూడా ఖర్చు పెట్టలేదని అన్నారు. ఇది వాస్తవమా.. అవాస్తమనేది అనేది చెప్పాలని డిమాండ్ చేశారు. ఒక మెడికల్ కాలేజీని పూర్తి చేయాలంటే రూ.470 కోట్ల నుంచి రూ.600 కోట్లు అవసరమవుతాయన్నారు. రూ.396 కోట్లతో పులివెందులలో మాత్రమే మెడికల్ కాలేజ్ పూర్తయిందన్నారు. మిగిలిన కళాశాలల నిర్మాణం ఎక్కడా 30 శాతం దాటలేదన్నారు. వీటిని పూర్తి చేసేందుకు ప్రభుత్వం పిపిపి విధానాన్ని అమల్లోకి తెచ్చిందన్నారు. దీని వల్ల ప్రభుత్వ వైద్య కళాశాలల కన్నా ఈ పద్ధతిలో పేద విద్యార్థులకు అదనంగా 110 సీట్లు వస్తున్నాయని, ఫీజుల్లో ఎలాంటి మార్పు ఉండదన్నారు. తొలి విడతలో 4 మెడికల్ కళాశాలలు ప్రారంభమవుతాయని అన్నారు. విశాఖలో గుగూల్ డేటా సెంటర్ రాష్ట్రానికి రావడం గర్వకారణమన్నారు. సూపర్ సిక్స్ సూపర్ హిట్ అయ్యిందన్నారు.

ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

ప్రజాశక్తి - కడియం, రాజమహేంద్రవరం

కూటమి ప్రభుత్వ పాలనా వైఫల్యాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని వైసిపి జిల్లా అధ్యక్షులు, మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ అన్నారు. బుధవారం కడియంలో వైసిపి రాష్ట్ర కార్యదర్శి గిరజాల బాబు ఆధ్వర్యంలో పార్టీ మండల అధ్యక్షులు వై.స్టాలిన్ అధ్యక్షతన రచ్చబండ, కల్తీ మద్యానికి వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను పక్కదారి పట్టించేలా రాజకీయాలు చేస్తుందన్నారు. ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలని అన్నారు. చంద్రబాబు చెప్పిన నాణ్యమైన మందులో నాణ్యత లేకుండా పోతుందన్నారు. వైద్య విద్యను పేదలకు దూరం చేసేందుకే పిపిపి విధానాన్ని తీసుకొస్తుందని విమర్శంచారు. అనంతరం ర్యాలీ నిర్వహించి, కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు.


కడియంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి చెల్లుబోయిన

నీ వాటా ఎంత బుచ్చయ్యా..?

మద్యం వ్యాపారుల సిండికేట్ దోపిడీలో నీ వాటా ఎంత బుచ్చయ్యా అని వేణుగోపాలకృష్ణ ఎంఎల్ఎ గోరంట్ల బుచ్చయ్య చౌదరిని ప్రశ్నించారు. రూ. 99 మద్యం బాటిల్‌ను రూ.130కి బెల్ట్ షాపుల్లో అమ్ముతున్నా బుచ్చయ్యచౌదరి నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్న తీరు చూస్తుంటే, అనుమానం కలుగుతుందన్నారు. ఈ వ్యవహారంలో ఆయనకు ముడుపులు అందుతున్నాయని వేణు ఆరోపించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపి గిరజాల వెంకటస్వామి నాయుడు, నాయకులు తాడాల విష్ణు చక్రవర్తి, కొత్తపల్లి శివాజీ, టేకి శ్రీను, ఈలి గోపాలం, దాసరి శేషగిరి, లావేటి రమేష్ పాల్గొన్నారు. అలాగే మెడికల్ కాలేజీలను ప్రయివేటు పరం చేయడాన్ని వ్యతిరేకిస్తూ వైసిపి ఆధ్వర్యంలో నిర్వహించే కోటి సంతకాల సేకరణ కార్యక్రమానికి సంబంధించిన బ్రోచర్‌ని ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్ బుధవారం ఆవిష్కరించారు. మార్గాని ఎస్టేట్స్‌లోని వైసిపి కార్యాలయంలో పార్టీ శ్రేణులతో కలిసి ఆయన బ్రోచర్ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ మెడికల్ కాలేజీలు ప్రజల ఆస్తి అన్నారు. వాటినిప్రజలే కాపాడుకోవాలన్నారు. జగన్మోహన్‌రెడ్డి ప్రజల తరపున పోరాడుతున్నారని, ప్రజలు కూడా సంఘీభావం తెలుపుతూ సంతకాలు చేయాలని కోరారు. వైసిపి నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

13 గంటల పని విధానంపై నిరసన

ప్రజాశక్తి - దేవరపల్లి


నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించిన 13 గంటల పని విధానాన్ని తక్షణమే రద్దు చేయాలని ప్రగతిశీల కార్మిక సమాఖ్య ఆధ్వర్యంలో కార్మికులు డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని దుద్దుకూరు జాతీయ రహదారిపై కార్మికులు నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సమాఖ్య నాయకులు మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చి కార్మిక హక్కులను హరించిందన్నారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం కార్మికుల శ్రమను పెట్టుబడిదారులకు దోచిపెట్టేందుకు ఎనిమిది గంటల పనివిధానం స్థానంలో 13 గంటల పని విధానాన్ని తీసుకొచ్చిందని అన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం 13 గంటల పని విధానాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రగతిశీల కార్మిక సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు మస్తాన్, లారీ వర్కర్స్ యూనియన్ నాయకులు ఆకాష్, కల్లేపల్లి కార్తీక్, టి.సత్యనారాయణ, మహమ్మద్ షఫీ, భాష, తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో విధులు నిర్వర్తించాలి

ప్రజాశక్తి - పెరవలి


సమావేశ:లో మాట్లాడుతున్న తహశీల్దార్

సచివాలయ ఉద్యోగులంతా సమన్వయంతో విధులను నిర్వర్తించాలని తహశీల్దార్ కె.నిరంజన్, ఎంపిడిఒ పద్మజ ఆదేశించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ ఉద్యోగులతో సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో పన్నుల వసూలు, పారిశుధ్యం, ఐవిఆర్‌ఎస్ కాల్స్, పిజిఆర్‌ఎస్ నివేదికలు, క్రమశిక్షణ నియమావళి వంటి వాటిని సమన్వయంతో పని చేయాలని అన్నారు. అనంతరం విఆర్‌ఒలు, అగ్రికల్చర్ టెక్నికల్ అసిస్టెంట్లు, ఆర్టికల్చర్ అసిస్టెంట్లు, సొసైటీ సెక్రెటరీలు, రైస్ మిల్లర్స్‌తో సమీక్ష సమావేశం జరిగింది. పంట కోత ప్రయోగంపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి సిహెచ్. వెంకటరమణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

అబ్దుల్ కలామ్‌కు ఘన నివాళి

ప్రజాశక్తి - యంత్రాంగం


రాజమండ్రిలో బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపల్ రామచంద్ర

రాజమహేంద్రవరం స్థానిక ఆర్ట్స్ కళాశాలలో మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఎపిజె.అబ్దుల్ కలామ్ జయంతిని నిర్వహించారు. తొలుత కలాం చిత్రపటానికి ప్రిన్సిపల్ డాక్టర్ రామచంద్ర ఆర్‌కె పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గణిత విభాగం, కంప్యూటర్ విభాగం ఆధ్వర్యంలో ఆర్-లాంగ్వేజ్‌పై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల పూర్వ విద్యార్థి డి.ధనుంజయరావు రిసోర్స్‌పర్సన్‌గా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ రామచంద్ర మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గణిత విభాగం హెడ్ జి.చంద్రశేఖర్, కళాశాల వైస్ ప్రిన్సిపల్ డివిఎన్ఎస్.మూర్తి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ కోఆర్డినేటర్ డాక్టర్ సిహెచ్.శ్రీనివాస్, గణిత విభాగం అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. **తాళ్లపూడి** మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జయంతిని మండలంలోని పైడిమెట్ట ఎంపిపిపి పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం దున్నా దుర్గారావు కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అబ్దుల్ కలాం జీవిత విశేషాలను హెచ్ఎం వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. **గోపాలపురం** స్థానిక మండల రెవెన్యూ కార్యాలయంలో ఎపిజె అబ్దుల్ కలాం జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా కలాం చిత్రపటానికి తహశీల్దార్ సాయి ప్రసాద్ పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డిటి సాంబశివరావు, నాయకులు హరీష్, మండల సర్వేయర్ తులసిమల్లి, ఎన్నికల సీనియర్ సహాయకులు నల్లరాజు, విఆర్‌ఒలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.


లింగ నిర్ధారణ పరీక్ష శిక్షార్హం

ప్రజాశక్తి - ఉండ్రాజవరం


అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి

లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే లింగ నిర్ధారణ చట్టం ప్రకారం శిక్షింపబడతారని స్థానిక పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ బి.దుర్గా మహేశ్వరరావు అన్నారు. బుధవారం స్థానిక పిహెచ్‌సిలో గర్భిణులు, బాలింతలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆడ బిడ్డ అయితే గర్భస్రావం చేయించి, చంపడం జరుగుతోందని, ఇది సరియైన పద్ధతి కాదన్నారు. ఆడ బిడ్డ అయినా, మగ బిడ్డ అయిన ఒకటే అని, ఇద్దరినీ సమానంగా చూస్తూ, ఇద్దరినీ చదివించాలన్నారు. తద్వారా ఆ కుటుంబం ఆర్థిక స్వావలంబన సాధించటం తో పాటు, సమాజం కూడా అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఒ ఎం.సుబ్రహ్మణ్యం, పిహెచ్ఎన్, కెడివిఎల్.కుమారి, సూపర్‌వైజర్లు సిహెచ్.రత్నకుమారి, కె.శ్రీరామమూర్తి, ఎఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్టూన్‘నిజం’



చేతుల శుభ్రతపై అవగాహన

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్, కడియం

స్థానిక వైటిసి ప్రాంగణంలో గ్లోబల్ హ్యాండ్ వాష్ డేపై అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మెప్మా పీడీ కె. కనకరాజు మాట్లాడుతూ వివిధ రకాల అంటువ్యాధుల నుంచి మనం, మన కుటుంబ సభ్యులు రక్షించుకోవాలంటే రోజువారీ జీవితంలో చేతులు శుభ్రంగా కడుక్కోవడం అత్యంత అవసరమని తెలిపారు. కరోనా సమయంలో చేతుల పరిశుభ్రత పాటించడం వలన చాలా వరకు కరోనా వ్యాప్తిని నివారించ గలిగినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మెప్మా జిల్లా టెక్నికల్ ఎక్సపర్ట్స్ ఫణికుమార్, శ్రీదేవి, రాజమహేంద్రవరం సిటీ మిషన్ మేనేజర్ రామలక్ష్మి, సాయికుమార్, కమ్యూనిటీ ఆర్గనైజర్స్, పట్టణ సమాఖ్య పదాధికారులు, రిసోర్స్‌పర్సన్ పాల్గొన్నారు. కడియం మండలం వీరవరం జడ్‌పి ఉన్నత పాఠశాలలో మ్యాజిక్ బస్ ఆధ్వర్యంలో చేతి శుభ్రతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం ఎన్‌పికె. విశ్వనాథం మాట్లాడుతూ ఆహారం తినే ముందు ఆహారం తిన్న తరువాత చేతులు పరిశుభ్రంగా కడుక్కోవాలన్నారు. అనంతరం మ్యాజిక్ బస్ యూత్ మెంటర్ పి.మాధురి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



కడియంలో అవగాహన సదస్సులో పాల్గొన్న విద్యార్థులు


రాజమహేంద్రవరం రూరల్‌లో అవగాహన కార్యక్రమం


శంకుస్థాపన చేస్తున్న ఎంఎల్ఎ ఆదిరెడ్డి శ్రీనివాస్

‘ఇచ్చిన మాటకు కట్టుబడి ఉన్నాం’

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ఇచ్చిన మాటకు కట్టుబడి ఉన్నామని, మాట నిలబెట్టుకునేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని రాజమహేంద్రవరం సిటీ ఎంఎల్ఎ ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. రూ.10 లక్షలతో 43వ వార్డులోని ఆయేషా మసీదు వద్ద నిర్మించే షెడ్డు పనులకు ఆయన బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024 ఎన్నికల్లో తనకు మద్దతు ఇచ్చి ఘన విజయం సాధించడంలో ముస్లిములు కీలక పాత్ర పోషించారన్నారు. తమ భవాని చారిటబుల్ ట్రస్టు ద్వారా ఈ షెడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశామన్నారు. 45 రోజుల్లో దీన్ని పూర్తి చేస్తామని తెలిపారు. రాజేంద్రనగర్ మసీదుకు పొజిషన్ సర్టిఫికెట్ గురించి కృషి చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి కాశీనవీన్‌కుమార్, వి.శంకర్, ముస్లిం మైనారిటీ నాయకులు చాన్ బాషా, ఎస్‌కె.బషీర్, అస్లాం, ఎమ్‌డి.బాబాఖాన్, అప్సరీ, రఫీ, ఎమ్‌డి షాజన్, అహ్మద్ ఉన్నీసా, మసీదు కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్‌ను కలిసిన ఎంఎల్ఎ ఆదిరెడ్డి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం


కమిషనర్‌ను సత్కరిస్తున్న ఎంఎల్ఎ ఆదిరెడ్డి

నగర పాలక సంస్థ నూతన కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన రాహుల్ మీనాను రాజమహేంద్రవరం సిటీ ఎంఎల్ఎ ఆదిరెడ్డి శ్రీనివాస్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. నగర పాలక సంస్థ ఆవరణలోని ఆయన ఛాంబర్‌లో పార్టీ నాయకులతో పాటు రాహుల్ మీనాను కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు రాజమహేంద్రవరం సిటీ అభివృద్ధి, రానున్న పుష్కరాల నేపథ్యంలో చేపట్టాల్సిన పనులు తదితర అంశాలపై చర్చించారు. టిడిపి నగర కమిటీ సభ్యులు, నాయకులు తదితరులు వారి వెంట ఉన్నారు.

నేరాలు ఘోరాలు



కాలువలోకి దూసుకెళ్లిన వ్యాన్

పంట కాల్వలోకి దూసుకెళ్లిన వ్యాన్

ప్రజాశక్తి- యు.కొత్తపల్లి

వ్యాను అదుపుతప్పి పంట కాలువలోకి దూసుకెళ్లిన సంఘటనలో బుధవారం ప్రమాదం తప్పింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మల్లం గ్రామానికి చెందిన కొంతమంది శుభకార్యానికి వెళ్లి తిరిగి వస్తుండగా యు.కొత్తపల్లి మండలం ఎండపల్లి, నాగులపల్లి వద్ద డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా వ్యాన్ పంట కాలువలోకి దూసుకెళ్లింది. వ్యాన్‌లో ఉన్న 30 మంది సురక్షితంగా బయటపడినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - గోపాలపురం

కంటైనర్ లారీ ఢీకొని ద్విచక్ర వాహనదారుడు మృతి చెందిన సంఘటన గోపాలపురం శివారులో బుధవారం చోటుచేసుకుంది... బంధువులు, తోటి ఉద్యోగులు తెలిపిన వివరాల ప్రకారం. నిడదవోలుకు చెందిన అహ్మద్ జవహర్(45) మండలంలోని కరిచర్లగూడెం గ్రామంలో ఉన్న ఓంకార్ ఫెర్టిలైజర్ కంపెనీలో మూడు నెలలుగా ఫిట్టర్‌గా పని చేస్తున్నాడు. బుధవారం కంపెనీ పని నిమిత్తం పంగిడికి వచ్చిన అతను తిరిగి ఫ్యాక్టరీకి ద్విచక్రవాహనంపై వెళ్లే క్రమంలో గోపాలపురం శివారులో కంటైనర్ లారీ వెనక నుంచి ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని బంధువులకు సమాచారం ఇచ్చారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పి.మనోహర్ తెలిపారు. లారీని స్టేషన్‌కు తరలించారు. మృతునికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.



బియ్యం స్వాధీనం చేసుకుంటున్న అధికారులు

పిడిఎస్ బియ్యం స్వాధీనం

ప్రజాశక్తి - తాళ్లపూడి

మండల పరిధిలోని పోచవరం గ్రామంలో అక్రమంగా నిల్వ చేసిన 1800 కేజీల పిడిఎస్ బియ్యాన్ని సివిల్ సప్లై అధికారులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. గ్రామంలోని ఒక ఇంటిలో రేషన్ బియ్యం నిల్వలు ఉన్నట్లుగా వచ్చిన సమాచారంతో అధికారులు దాడులు నిర్వహించారు. స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని చౌక ధరల దుకాణంలో అప్పగించారు. బియ్యాన్ని నిల్వచేసిన గుర్రాల పోసియ్యపై 6 ఎ కేసు నమోదు చేశామని డిటి దివాకర్ తెలిపారు. ఈ దాడుల్లో డిఎస్ఒ పార్వతి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంపై కేసు నమోదు

ప్రజాశక్తి - కొవ్వూరు

కొవ్వూరు రోడ్ కం రైల్వే వంతెనపై ఈ నెల 12న జరిగిన రోడ్డు ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేశారు. మండలంలోని దేచర్ల గ్రామానికి చెందిన నూకతట్టి భూపతిరావు ఈనెల 12న వ్యక్తిగత పని మీద రాజమహేంద్రవరం వెళ్లి ద్విచక్రవాహనంపై తిరిగి వస్తుండగా రోడ్డు కం రైల్వే వంతెనపై వ్యాన్ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో అతను తీవ్ర గాయాలపాలయ్యాడు. అదే వ్యాన్ డ్రైవర్ రాజమహేంద్రవరంలో ఒక ప్రయివేటు ఆస్పత్రిలో చేర్పించి వెళ్లిపోయాడు. దీంతో బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

శానిటేషన్ పనుల తనిఖీ

ప్రజాశక్తి - కాకినాడ

నగరంలోని శానిటేషన్ పరిస్థితిని ఇన్‌ఛార్జి కమిషనర్ కెటి.సుధాకర్ బుధవారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. నగరంలోని వార్ఫ్ రోడ్డు, జిల్లా పరిషత్ ప్రాంతాలు, 14వ సర్కిల్‌లోని గైగోలుపాడు ప్రాంతాల్లో శానిటేషన్ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా శానిటేషన్ పనుల నిర్వహణపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన శానిటేషన్ ప్రమాణాలు మెరుగు పర్చకపోతే కఠిన చర్యలు తప్పవని సిబ్బందిని హెచ్చరించారు. 12వ సర్కిల్‌లోని మస్టర్ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆయన పారిశుధ్య కార్మికుల హాజరు పత్రాలను పరిశీలించారు. ఈ తనిఖీల్లో శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు సత్తిబాబు, దుర్గారావు పాల్గొన్నారు.

రౌతులపూడిలో అన్నదానం

ప్రజాశక్తి - రౌతులపూడి

మండల కేంద్రమైన రౌతులపూడిలో దేవీ నవరాత్రి ఉత్సవాల కార్యక్రమంలో భాగంగా బుధవారం శ్రీనివాస వర్తక సంఘం ఆధ్వర్యంలో భారీ అన్నదానం నిర్వహించారు సుమారు 8000 మంది యాత్రికులు అన్నదాన కార్యక్రమానికి హాజరైనట్లు నిర్వాహకులు తెలిపారు. మండలంలోని బలరామపురం, ఎస్.పైడిపాల, గుమ్మరేగుల, బంగారయ్యపేట గ్రామాల నుంచి భారీ సంఖ్యలో యాత్రికులు హాజరైనట్టు పేర్కొన్నారు.

ఉపాధి హామీపై సమీక్షా సమావేశం

ప్రజాశక్తి - రౌతులపూడి

ఉపాధి హామీ పథకంలో పని చేసే శ్రామికులకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇకెవైసిని నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని కత్తిపూడి సెక్షన్ ఎపిడి భ్రమరాంబ ఉపాధి హామీ సిబ్బంది ఆదేశించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ శివరామకృష్ణయ్య, ఉపాధి హామీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. మండలవ్యాప్తంగా 24 వేల మంది ఉపాధి శ్రామికులకు గాను ఇప్పటివరకు 14,000 మందికి ఉపాధి హామీ పూర్తి చేసినట్టు తెలిపారు.

భూములు అప్పగించాలి

ప్రజాశక్తి - తాళ్లపూడి

తమ భూములను తమకు అప్పగించాలని తుపాకులగూడేనికి చెందిన దళితులు కోరుతున్నారు. ఈ సందర్భంగా దళిత మహిళలు డాకే వెంకాయమ్మ, గండి రత్నకుమారి తదితరులు మాట్లాడారు. మండలంలోని తూపాకుల గూడెంలో సర్వేనెంబర్ 49/2లో 2005 అప్పటి ప్రభుత్వం 28 ఎకరాలను కేటాయించిందన్నారు. ఈ భూములపై గోపవరానికి చెందిన కొంత మంది కన్ను పడిందన్నారు. వారు ఈ భూముల్లో అన్యాయంగా సాగు చేస్తున్నారని తెలిపారు. తాము పంటలు వేసుకుంటుంటే నాసరం చేస్తున్నారన్నారు. గతంలో జిలా అధికారుల దృష్టికి తమ సమస్యను తీసుకెనళ్లాని తెలిఆపరు. ఈ భూమి తమకు చెందినదేనని అధికారులు గుర్తించారన్నారు. కాని నేటికీ భూములు మాత్రం అప్పగించలేదన్నారు. స్థానికంగా ఉన్న కొంత మంది అధికారుల భూములను ఆక్రమించుకున్న వారికే వత్తాసు పలుకుతూ తమకు అన్యాయం చేస్తున్నారని వాపోయారు. తమ పంటలను ఆక్రమణదారులు తీసుకెళ్లిపోతున్నా అధికారులు స్పందించట్లేదన్నారు. ఇప్పటికైనా దళితుల భూములు వారికే కేటాయించాలని, లేకుంటే ఎంతలి పోరాటానికైనా సిద్ధపడతామని తెలిపారు. వీరికి డాకే రాజు మద్దతు తెలిపారు.

ఎంఆర్‌పిస్, ఎంఎస్‌పి నూతన కమిటీల ఎన్నిక

ప్రజాశక్తి - గోకవరం



ఎంఆర్‌పిఎస్ మండల కమిటీ నాయకులు

ఎంఆర్‌పిఎస్, మహజన సోషలిస్టు పార్టీ(ఎంఎస్‌పి) మండల కమిటీలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యాయి. బుధవారం స్థానిక రజకుల కమ్యూనిటీ హాల్లో మండల ఎంఆర్‌పిఎస్ గ్రామ కమిటీల పర్యవేక్షకులు గరభారపు శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎంఎస్‌పి అనుబంధ సంఘాల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఎంఆర్‌పిఎస్ జిల్లా ఇన్‌ఛార్జ్ బయ్యవరపు రాజేశ్వరరావు, ఎంఎస్‌పి జిల్లా అధ్యక్షుడు కొడమంచిలి వెంకట్రావు, ఎంఆర్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు గడ్డం వినోద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఎస్‌పి మండల అధ్యక్షులుగా గరభారపు శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా ములపర్తి నాగేశ్వరరావు, రామవరపు రాజేష్, ప్రధాన కార్యదర్శిగా ములపర్తి భూషణం, కార్యదర్శులుగా పులిగుర్తి రాములు, పైడిమల్ల అప్పారావు, కోశాధికారిగా చిడిపి ప్రసాద్, ఎగ్జిక్యూటివ్ మెంబర్ ఇండిగమెల్లి సురేష్ ఎన్నికయ్యారు. అలాగే ఎంఆర్‌పిఎస్ మండల అధ్యక్షులుగా చాపల సూరిబాబు, ఉపాధ్యక్షులుగా జగ్గారపు చిరంజీవి, మద్దాల శ్రీను, ప్రధాన కార్యదర్శిగా కుందేటి గంగాధర్, కార్యదర్శిగా కొల్లి ముసలయ్య, కోశాధికారిగా లంక డానియల్, అలాగే ఎంఇఎఫ్ మండల అధ్యక్షులుగా పైడిమల్ల లక్ష్మణరావు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో వివిధ మండలాలకు చెందిన ఎంఆర్‌పిఎస్ నాయకులు పాల్గొన్నారు.

దూబచర్లలో మెగా రక్తదాన శిబిరం

ప్రజాశక్తి - నల్లజర్ల



రక్తదానం చేస్తున్న శ్రీలక్ష్మి

అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా లయన్స్ క్లబ్ దూబచర్ల, పార్డ్ ఇండియా స్వచ్ఛంద సేవా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో దూబచర్లలో మెగా రక్తదాన శిబిరాన్ని బుధవారం నిర్వహించారు. ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రి బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో దాతల నుంచి రక్తాన్ని సేకరించారు. ఎలైట్ విద్యా సంస్థల ప్రిన్సిపల్ కలగర.శ్రీలక్ష్మి రక్తాన్ని దానం చేశారు. ఈ సందర్భంగా శ్రీలక్ష్మి మాట్లాడుతూ ప్రతి రక్తదాత ప్రాణదాతగా నిలుస్తారని అన్నారు. తాను ఇప్పటికే 11 సార్లు బ్లడ్ డొనేషన్ చేశానని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్డ్ ఇండియా జాతీయ అధ్యక్షులు, బ్లడ్ క్యాంప్ కోఆర్డినేటర్ అంబటి శ్రీనివాసరావు, లయన్స్ క్లబ్ అధ్యక్షులు తమ్మిన శ్రీనివాసరావు, పార్డ్ ఇండియా గౌరవ అధ్యక్షులు చీమకుర్తి కృష్ణప్రసాద్, ఎలైట్ విద్యాసంస్థల కరెస్పాండెంట్స్ గారపాటి సుబ్బారావు, యలమర్తి సుదర్శన్, బ్లడ్ బ్యాంక్ డాక్టర్ సోనియామోహన్, జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రహదారి నిర్మాణంలో తీవ్ర జాప్యం

ప్రజాశక్తి - సీతానగరం



ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు, ప్రయాణికులు

సీతానగరం నుంచి పురుషోత్తంపట్నం వరకు జరుగుతున్న రహదారి నిర్మాణం నత్తనడకన సాగుతుంది. కేవలం ఒకే మిషన్‌తో పనులు చేయిస్తుండటంతో పనులు ముందుకు సాగడం లేదు. అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా నాణ్యతకు తిలోదకాలు ఇస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. రహదారి నిర్మాణ పనులతో ఆర్‌టిసి సేవలను పూర్తిగా నిలిపివేశారు. దీంతో విద్యార్థులు, ఉద్యోగులు, సాధారణ ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాత్రి సమయంలో కిలోమీటర్ల మేర కంకరను గుట్టలుగా పోసి ఉదయం పది గంటలైనా సర్దకపోవడంతో ద్విచక్ర వాహనదారులు సైతం ప్రయాణం చేసే పరిస్థితి లేకుండా పోతుంది. మరోవైపు పోలవరం ప్రాజెక్టుకు సంబంధించిన వాహనాలకు మాత్రం మినహాయింపు ఇవ్వడం విశేషం. తక్షణమే రోడ్డు నిర్మాణం పనులను పూర్తి చేసేలా ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

ఓట్ల సర్వేపై సమీక్ష

ప్రజాశక్తి - గోపాలపురం

ఓటర్ల సర్వేపై బుధవారం స్థానిక మండల రెవెన్యూ కార్యాలయంలో సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో తహశీల్దార్ సాయి ప్రసాద్ బిఎల్‌ఒలు ఇంటింటా సర్వే చేసి ఓట్ల నమోదు, మృతుల పేర్లు తొలగింపు, నూతన ఓటర్ల చేర్పులు చేసే కార్యక్రమాన్ని వివరించారు. బూత్ లెవెల్ ఏజెంట్లు సహకరించాలని కోరారు. జనవరి నుంచి స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ జరుగుతుందని, అర్హులైన ప్రతీ ఒక్కరూ ఓటును నమోదు చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు, ఎన్నికల ఉప తహశీల్దార్ సాంబశివరావు, సీనియర్ సహాయకులు నల్లరాజు, ఎఎస్ఒ జోడాల వెంకట్ పాల్గొన్నారు.

ఉపాధి హామీ గ్రామసభలు

ప్రజాశక్తి - సీతానగరం

ఉపాధి హామీ చట్టంలో పనులు గుర్తించేందుకు బుధవారం మండలంలోని ఉండేశ్వరపురం, ముగ్గళ్ళ పంచాయతీల్లో గ్రామ సభలు నిర్వమించారు. ఈ కార్యక్రమంలో కాలువ పనులు 9, చెరువుల గట్టు పైన మొక్కలు పెంచుట 1, సోక్ పిట్లు 33, కంపోస్ట్ పిట్లు 15, పుంత రోడ్ల నిర్మాణం 2, మ్యాజిక్ డ్రెయిన్ మొదలగు పనులను గుర్తించారు. ముగ్గళ్ళలో 26 కాలువ పనులు, రెండు చెరువులు, రెండు ఫారం పాండ్లు, మూడు సోక్ పిట్లు, ఐదు కంపోస్ట్ పిట్లు, రెండు పుంత రోడ్ల నిర్మాణం మొదలగు పనులు గుర్తించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు గుర్రాల జ్యోస్నా, సర్పంచ్ గెడ్డం భద్రలక్ష్మీ, సెక్రటరీ హేమంత్ వంశీకృష్ణ, ఇంజనీరింగ్ కన్సల్టెంట్ నాగేశ్వరరావు, టెక్నికల్ అసిస్టెంట్ రాజు ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - గోపాలపురం



గ్రామ సభలో మాట్లాడుతున్న సిఐ నాగేశ్వర్‌నాయక్

చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని దేవరపల్లి సిఐ బి.నాగేశ్వర్ నాయక్ అన్నారు. బుధవారం మండలంలోని వాదాలకుంట గ్రామంలో చట్టాలపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు తప్పనిసరిగా చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. అవగాహన లోపంతో అల్లర్లకు, నేరాలకు, దాడులకు పాల్పడుతున్నట్లు తెలిపారు. ఆర్థిక, లైంగిక, శారీరక, పిఒసిఎస్ఒ సైబర్ క్రైమ్ వంటి వివిధ రకాల నేరాలుపై అవగాహన కల్పించారు. గ్రామాన్ని సిసి కెమెరాలు నిఘాలో ఉంచడానికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ పి.మనోహర్, ట్రైనీ ఎస్ఐ పి.శివగణేష్, సిబ్బంది పాల్గొన్నారు.

26న శిఖామణి సాహితీ పురస్కారాల ప్రదానం

ప్రజాశక్తి - యానాం

యానాం కవిసంధ్య సాహిత్య సాంస్కృతిక సంస్థ ఏటా ప్రతిష్టాత్మకంగా అందించే శిఖామణి సాహితీ పురస్కారాల ప్రదానోత్సవ సభ ఈ నెల 26న నిర్వహిస్తున్నట్టు ఆ సంస్థ ఆధ్యక్షుడు డాక్టర్ శిఖామణి తెలిపారు. ఈ ఏడాది శిఖామణి జీవన సాఫల్య పురస్కారం ప్రముఖ కవి, రచయిత, పద్మశ్రీ ఆచార్య కొలకలూరి ఇనాక్‌కు ప్రదానం చేయనున్నట్టు తెలిపారు. యువపురస్కారం ప్రముఖ కవి, విమర్శకుడు అవధానుల మణిబాబుకు ప్రదానం చేయనున్నట్టు తెలిపారు. పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు పురస్కారాలను ప్రదానం చేస్తారన్నారు. కవిసంధ్య ప్రతిభా పురస్కారాలను డాక్టర్ కోయి కోటేశ్వరరావు, ఎస్ఆర్.పృథ్వి, పిఆర్ఎల్.స్వామి, బిహెచ్‌వి.మంగేష్, డాక్టర్ వరుగు భాస్కర్‌రెడ్డి, పచ్చిమాల శివనాగరాజు, పుప్పాల సూర్య కుమారి, పొనుగు మట్ల అశోక్ కుమార్, పెనుమాక రత్నాకర్, మిరప మహేష్‌కు అందించనున్నారు.

యాత్రికులకు అసౌకర్యం లేకుండా చర్యలు

ప్రజాశక్తి - కొవ్వూరు

కొవ్వూరు గోష్పాద క్షేత్రంలో ఈ నెల 27న నిర్వహించ తలపెట్టిన గోదావరి హారతి కార్యక్రమంలో ఎటువంటి అసౌకర్యం లేకుండా చర్యలు తీసుకోవాలని ఆర్‌డిఒ రాణి సుస్మిత ఆదేశించారు. బుధవారం గోదావరి హారతి కార్య క్రమంపై సమీక్షా సమావేశం రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గోదావరి హారతి కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలన్నారు. వీక్షకుల కోసం కూర్చునే సీటింగ్ ఏర్పాట్లు పెంచాలని, విశాలమైన వేదికను ఏర్పాటు చేయాలని సూచించారు. గత సంవత్సరం ఎదురైన చిన్నపాటి లోపాలను పరిగణనలోకి తీసుకుని ఈసారి కార్యక్రమం మరింత ప్రతిష్ఠాత్మకంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి ఉత్సవమూర్తులను తీసుకువచ్చి సంప్రదాయ పద్ధతిలో హారతి నిర్వహించడం జరుగుతుందని, భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సిహెచ్.వెంకటేశ్వర్లు, కౌన్సిలర్లు సురపునేని చిన్న, పిల్లలమర్రి మురళీకృష్ణ, మేనేజర్ ఎం.భరత్, మాజీ కౌన్సిలర్ బర్ల శ్రీను పాల్గొన్నారు.

ఖైదీలకు బెయిల్, ష్యూరిటీలపై చర్యలు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత

అండర్ ట్రయల్ ఖైదీలకు సంబంధించి బెయిల్, ష్యూరిటీలపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ ఛైర్‌పర్సన్ గంధం.సునీత ఆదేశించారు. బుధవారం స్థానిక జిల్లా కోర్టు ప్రాంగణంలో అండర్ ట్రయల్ రివ్యూ కమిటీ సమావేశం, ఎగ్జిక్యూటివ్ బాడీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అండర్ ట్రయల్ ఖైదీలకు సంబంధించిన కేసుల దర్యాప్తు, చార్జీషీట్ల దాఖలు అంశాలపై చర్చించారు. ఖైదీలకు బెయిల్, ష్యూరిటీలు సంబంధించి ఎదురవుతున్న సమస్యలపై చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ సమావేశంలో సీనియర్ సివిల్ జడ్జి ఎస్‌కె.జానీబాషా, ఇన్‌ఛార్జ్ జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి బి.పద్మ, జిల్లా అదనపు ఎస్‌పి (అడ్మిన్) ఎంబిఎస్.మురళీకృష్ణ, కాకినాడ సిఐ ఆర్.రవికుమార్, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కొనసీమ జిల్లా అదనపు ఎస్‌పి ఎవిఆర్‌పిబి.ప్రసాద్, డిఆర్ఒ టి.సీతారామమూర్తి, సెంట్రల్ జైల్ సూపరింటెండెంట్ ఎస్.రాహుల్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మానసిక ఆరోగ్య అవగాహనా వారోత్సవాలు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

మానసిక ఆరోగ్య అవగాహన వారోత్సవాల సందర్భంగా బుధవారం యుపిహెచ్‌సి ఆవ బాంబే కాలనీలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డిస్ట్రిక్ మెంటల్ హెల్త్ ప్రోగ్రాం నోడల్ ఆఫీసర్ ప్రియాంకరాయ్ మానసిక ఆరోగ్యం యొక్క ప్రాముఖ్యత, విపత్తుల సమయంలో మానసిక సంసిద్ధతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో యుపిఎస్‌సి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ టి.వినీత, ఎఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

భేటీ బచావో-భేటీ పడావో

ప్రజాశక్తి - పెరవలి, నల్లజర్ల

మండలంలోని కానూరు పిహెచ్‌సి పరిధిలో భేటీ బచావో భేటీ పడావో కార్యక్రమంలో భాగంగా అవగహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పిహెచ్‌సి వైద్యులు డాక్టర్ రాజనాల ప్రసాద్, డాక్టర్ లావణ్య మాట్లాడారు. లింగ నిర్ధారణకు ప్రయత్నించడం నేరమని, అటువంటి వారికి కఠిన శిక్షలకు గురవుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సబ్బంది, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే నల్లజర్ల మండలంలోని పోతవరంలో భేటీ బచావో భేటీ పడావో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సిహెచ్.శైలజ మాట్లాడారు. పోతవరం పిహెచ్‌సి పరిధిలోని 12 సచివాలయాల్లో ఈ కార్యక్రమాన్ని పూర్తి చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ కృష్ణకుమారి, ఎఎన్‌ఎంలు, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

జిఎస్‌టి తగ్గింపుపై అవగాహన

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

స్థానిక ఆర్ట్ కళాశాలలో జిఎస్‌టి తగ్గింపుపై బుధవారం అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సదస్సులో రిసోర్స్‌పర్సన్‌గా చార్టెడ్ అకౌంటెంట్ వేదాంతం రాహుల్ జిఎస్‌టి తగ్గింపు వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ రామచంద్ర ఆర్‌కె, కామర్స్ విభాగాధిపతి డాక్టర్ పివివి.సత్యనారాయణ, ఐక్యుఎసి కోఆర్డినేటర్ డాక్టర్ ఎఎ.అన్నపూర్ణ, డాక్టర్ షణ్ముఖరావు, వి.రమేష్‌కృష్ణ, హెచ్‌ఎస్‌ఎస్‌వి.పవన్‌కుమార్, ఎకనామిక్స్ లెక్చరర్ ఆనందరావు, ఇతర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమగ్ర నివేదికను రూపొందించాలి


ప్రజాశక్తి - తాళ్లపూడి

పోలీస్ శాఖకు సంబంధించిన విషయాలతో పాటు ఆయా గ్రామాల్లోని అన్ని రకాల సమాచారాన్ని సేకరించి సమగ్ర నివేదికను రూపొందించాలని ఎస్ఐ టి.రామకృష్ణ సూచించారు. బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సచివాలయ మహిళా పోలీసులకు అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయ పార్టీలు, నాయకులు, జనాభా, నేల చరితులు ఇతర మౌలిక అంశాలతో పూర్తి సమాచారాన్ని సేకరించి ఒక ఫార్మాట్‌లో నివేదించాలని అన్నారు. ఈ సమావేశంలో ట్రైనీ ఎస్ఐ ఆదిత్యశ్రీనివాస్, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - పెరవలి

మండలంలోని కాకరపర్రు 11 కెవి ఫీడర్లపై ఆర్‌డిఎస్ఎస్ పనులు నిమిత్తం గురువారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఎపిఇపిడిసిఎల్ ఇఇ ఎన్.నారాయణ అప్పారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెరవలి సబ్‌స్టేషన్ పరిధిలోని సీతారాంపురం, కాకరపర్రు గ్రామాలకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు తెలిపారు. కావున వినియోగదారులు సహకరించాలని కోరారు.



దుకాణాల ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అధికారులు

బాణసంచా షాపుల ఏర్పాటుకు స్థల పరిశీలన

ప్రజాశక్తి - తాళ్లపూడి

దీపావళి బాణసంచా దుకాణాల ఏర్పాటు కోసం అవసరమైన స్థలాన్ని బుధవారం రెవెన్యూ, పోలీసు, అగ్నిమాపక శాఖల అధికారులు పరిశీలించారు. గతంలో దుకాణాలు ఏర్పాటు చేసిన స్థలాలతోపాటు, కొత్త ప్రాంతాలను అధికారులు పరిశీలించారు. లైసెన్సు పొందిన వారితోపాటు, విక్రయాలు చేసేందుకు అనుమతి పొందిన వ్యాపారులు ప్రభుత్వ నిబంధనలకు లోబడి షాపులు ఏర్పాటు చేసుకోవాలని అధికారులు సూచించారు. నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

3 నుంచి మున్సిపల్ కార్మికుల సమ్మె

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

మున్సిపల్ పారిశుధ్య కార్మికుల సమస్యల పరిష్కారం కోసం నవంబర్ 3వ తేదీ నుంచి సమ్మెకు వెళుతున్నట్లు ఎపి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు తాటిపాక మధు తెలిపారు. బుదవారం యూనియన్ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా జరిగింది. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ మున్సిపల్ పారిశుధ్య కార్మికులు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. సమస్యల పరిష్కారం కోసం గతంలో చేపట్టిన సమ్మె సందర్భంగా 2023 డిసెంబర్ 7న సమ్మె విరమణ ఒప్పందం జరిగిందన్నారు. సమ్మె ఒప్పందంలో ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదన్నారు. ఈ నేపథ్యంలోనే అక్టోబర్ 22 నుంచి వివిధ రూపాల్లో పోరాట కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. అప్పటికి ప్రభుత్వం దిగిరాకపోతే నవంబర్ 3 నుంచి సమ్మెకు రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ పారిశుధ్య కార్మికులు దిగుతారని తెలిపారు. అనంతరం నూతన కమిషనర్ రాహుల్ మీనాను యూనియన్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి, ఇతర నాయకలు పాల్గొన్నారు.